# <u>సిజేరియన్ ఆపరేషన్</u>

"పూర్వం ప్రసూతి సౌకర్యాలు, శస్త్ర చికిత్సా సదుపాయాలు అందుబాటులో లేకపోవడంతో మాతా శిశు మరణాలు అధికంగా ఉండేవి. ఈనాడు వైద్య శాస్త్ర పురోగమనంతోనూ సిజేరియన్ ఆపరేషన్ అందరికీ అందుబాటులోకి రావడంతోనూ మాతా శిశు మరణాలు గణనీయంగా తగ్గిపోయాయి" అని ప్రముఖ గైనకాలజిస్ట్ డా॥మారు పేర్కొన్నారు. వాసవ్య నర్సింగ్ హోమ్‌లో డా॥సమరం అధ్యక్షతన శనివారం జరిగిన ఆరోగ్య సదస్సులో ఆమె "సిజేరియన్ ఆపరేషను" అంశంపై ప్రసంగించారు. ఆమె మాట్లాడుతూ సిజేరియన్ ఆపరేషన్ అందుబాటులోకి రావడంతో మాతృత్వం తీయదనాన్ని ప్రతీ స్త్రీ తన అనుభవంలోకి తెచ్చుకోగలుగుతుందని అన్నారు. పూర్వంకంటే సిజేరియన్ ఆపరేషన్లు అధికంగా చేస్తున్నారని అనడంలో నిజం లేదన్నారు. అనవసరంగా సిజేరియన్ ఆపరేషను ఎవరూ చేయరన్నారు. తల్లి బస్థీ ఎముకల ద్వారం చిన్నదిగా ఉన్నా, బిడ్డ తల పెద్దదిగా ఉన్నా, బిడ్డ పొజిషన్ తేడాగా ఉన్నా సిజేరియన్ ఆపరేషను తప్పనిసరి అన్నారు. గుర్రపు వాతం లక్షణాలు ఉన్నవారికి, అంతకుముందు సక్రమంగా కాన్పులు కానివారికి, 40 ఏళ్ళ వయస్సులో తల్లులైనవారికి, గుండె జబ్బు ఉన్న తల్లులకు సిజేరియన్ చేస్తే తల్లీ బిడ్డ క్షేమంగా ఉంటారని చెప్పారు. కొందరు గర్భస్థ శిశువుల మెడకి బొడ్డు తాడు చుట్టుకుని ఉంటుందని లేదా చాలా చిన్నదిగా ఉంటుందని, లేక బయటకు జారుతుందని, అలాంటప్పుడు సిజేరియన్ చేయకపోతే గర్భంలోనే బిడ్డపోయే ప్రమాదం ఉందన్నారు. బిడ్డ అడ్డం తిరిగి ఉన్నా, కవలలు ఒకరికి ఒకరు పెనవేసుకున్నా మామూలు కాన్పు అవదన్నారు. ఉమ్మనీరు కారిపోతున్నా సిజేరియన్ తప్పనిసరి అన్నారు. పూర్వకాలం సిజేరియన్ ఆపరేషను అందుబాటులో లేకపోవడం వల్ల ఇటువంటి తల్లులు ప్రాణాలు కోల్పోయేవాళ్ళు అన్నారు. అల్ట్రా సౌండ్ స్కానింగ్, ఫీటల్ స్కానింగ్, ఫీటల్ డాప్లర్, కలర్ డాప్లర్, ఎక్సరే, లేబరేటరీ పరీక్షలు తల్లి బిడ్డ విషమ పరిస్థితిని ముందుగానే తెలుసుకోవడానికి తోడ్పడతాయన్నారు.